
పంటల బీమాకు మంగళం

- అన్నదాతలపై కూటమి మోపిన ప్రీమియం భారం
- రైతులే చెల్లించాలని ఉత్తర్వులు జారీ
- గత వైఎస్సార్‌సీపీ పాలనలో బీమా ప్రీమియం చెల్లించిన ప్రభుత్వం



రైతులపై అదనపు భారం

నగరి : ఉచిత పంటల బీమా పథకాన్ని కూటమి ప్రభుత్వం అటకెక్కించింది. ప్రీమియం రైతులే భరించాలని ఉత్తర్వులు జారీ చేసింది. విత్తనాలు కొనేందుకు ఇంట్లో నగలు తాకట్టు పెట్టిన రైతన్నకు ఇది భారంగా మారుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తన హయాంలో రైతన్నలకు భారం పడకుండా ప్రీమియం చెల్లించింది. అయితే దీనికి భిన్నంగా కూటమి ప్రభుత్వం రైతులే చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేయడంతో రైతాంగం మండిపడుతోంది. గత ఏడాది సరైన సమయంలో వర్షాలు లేక.. పంటలు పండక.. గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బంది పడ్డారు. ఇపుడు బీమా ప్రీమియం చెల్లింపు వారికి అదనపు భారంగా మారింది. విత్తనం కొనుగోళ్లకే డబ్బు లేక ఇంట్లో వస్తువులు తాకట్టు పెట్టుకోవాల్సిన పరిస్థితి కలిగింది. ఈ నేపథ్యంలో ఏ ప్రోత్సాహం అందివ్వని కూటమి ప్రభుత్వం ఇపుడు ఉచిత పంటల బీమాను అటకెక్కించింది.

2711 ఎకరాల్లో సేద్యం

మండల వ్యాప్తంగా 2711 ఎకరాల సేద్యపు భూములున్నాయి. ప్రధానంగా ఖరీఫ్ సీజన్‌లో వరి, వేరుశనగ, చెరకు, పొద్దుతిరుగుడు తదితర పంటలు సాగు చేస్తారు. ఈ ఏడాది వర్షం సరిగా కురకపోవడంతో బోరు బావుల కింద అరకొరగా సాగు చేస్తున్నారు. మరిన్ని ప్రాంతాల్లో ఉద్యాన పంటలు సాగు చేశారు.

రైతులపై అదనపు భారం

గత ఏడాది కాస్తో కూస్తో పండిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమైన కూటమి ప్రభుత్వం ఈ ఏడాదైనా ఆదుకుంటుందని ఉన్న రైతన్నల ఆశలపై నీళ్లు చల్లింది. ప్రీమియం భారం మోపింది. ఒక్కో పంటకు ఒక్కో రకంగా ధర నిర్ణయించి రైతులే చెల్లించాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది. వరికి ఎకరాకు రూ.84, వేరుశనగకు ఎకరాకు రూ.560, అరటి ఎకరాకు రూ.3025, ఉల్లికి ఎకరాకు రూ.90, మొక్కజొన్నకు రూ.66 చొప్పున ప్రీమియం కట్టాలని స్పష్టం చేసింది. ప్రీమియం చెల్లిస్తేగానీ విపత్కర పరిస్థితులలో బీమా వర్తించదని, ఈ నెలఖరులోపు ప్రీమియం చెల్లించాలని వ్యవసాయాధికారులు చెబుతుండడంతో రైతన్నలు కూటమి ప్రభుత్వానికి శాపనార్థాలు పెడుతున్నారు.

గతంలో అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా అండగా నిలిచింది. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి విత్తనాలు ఎరువులను సరఫరా చేయడమేగాక అధిక దిగుబడులు సాధించేందుకు సూచనలు-సలహాలు ఇప్పించింది. పంటలను గిట్టుబాటు ధరతో కొనుగోలు చేసింది. వేసిన పంటలను ఈ-క్రాప్ చేయించిన ప్రతి రైతుకు ఉచిత పంటల బీమాను అమలు చేసింది. కూటమి ప్రభుత్వం దీనికి పూర్తిగా మంగళం పాడింది.

ప్రభుత్వమే చెల్లించాలి

"అన్నదాత సుఖీభవ కింద సాయం చేయలేదు. కనీసం ఉచిత పంటల బీమా అయినా అమలు చేయాలి. గతంలోలాగే ప్రీమియం మొత్తం ప్రభుత్వమే చెల్లించి ఆదుకోవాలి. పెట్టుబడికే డబ్బులేక అన్నదాత ఇబ్బంది పడుతున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయం అందజేయాలి.

– దాస్, రైతు, చిన్నలూరు.

హామీలు నెరవేర్చాలి



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఏటా రూ.20 వేల ఆర్థిక సాయంపైనా ఇప్పటివరకూ ఉలుకూ లేదు; పలుకూ లేదు. ఉద్యాన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఉచిత బీమా పథకాన్ని ఎత్తివేయడం రైతులకు భారంగా మారింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి.

– నాగభూషణం, రైతు, నాగరాజకుప్పం.

క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయండి



గుట్టమీదఇండ్లలో పనులను పరిశీలిస్తున్న డీఈ

పాలసముద్రం: మండలంలో ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని డీఈ రాఘవయ్య ఆదేశించారు. మంగళవారం గుట్టమీదఇండ్లు గ్రామంలో ఎస్టీలు నిర్మించుకుంటున్న గృహ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గతంలో మంజూరైన ఇళ్లను వెంటనే పూర్తి చేయాలన్నారు. పూర్తయితేనే బిల్లులు మంజూరవుతాయని తెలిపారు. హౌసింగ్ ఏఈ మధు, సూపర్‌వైజర్ బాబు, ఇంజినీర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

జువాలజీ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

నగరి : స్థానిక పీసీఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జువాలజీ గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటాచలపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ జువాలజీలో ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులై వారు ఈ నెల 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కంచి కామాక్షిగా దేశమ్మ



నగరి: పట్టణంలోని నేత్ర ప్రదాయిని దేశమ్మ ఆడినెల పూజల్లో భాగంగా కంచి కామాక్షిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆడి మంగళవారం ప్రత్యేకం కావడంతో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. కంచి కామాక్షి అలంకరణలో అమ్మవారిని దర్శించుకుని భక్తిపారవశ్యంలో మునిగిగారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు కళ్లలో తీర్థం పోసుకున్నారు. ఆలయ ఈఓ డబ్బుగుంట వెంకటేశ్వర్లు, ఉత్సవ కమిటీ సభ్యులు మదన్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా కారేటి గంగమ్మ కొలుపు



ప్రత్యేక అలంకరణలో కారేటి గంగమ్మ

కార్వేటినగరం: మండలంలోని టీకేఎం పేట పంచాయతీ ఎగువరాజుల కండ్రిగ గ్రామ సమీపంలోని శ్రీకారేటి గంగమ్మ ఆలయంలో మంగళవారం కొలుపు ఘనంగా నిర్వహించారు. వేకువజామున అమ్మవారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాల అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మహిళలు అమ్మవారికి అంబలి సమర్పించి మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో పొంగళ్లు వండి, పిండి దీపాలతో నైవేద్యం సమర్పించారు. కర్పూర హారతులు ఇచ్చారు. ఆ తర్వాత హరికథా కాలక్షేపం భక్తులను ఆకట్టుకుంది.

నోట్ పుస్తకాలు పంపిణీ



నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్న చంద్రయ్య

విజయపురం: మండలంలోని మంగళం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయుడు చంద్రయ్య విద్యాసామగ్రి వితరణ చేశారు. సుమారు 30 మందికి నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

ఆయిల్ పామ్ తోటలు సాగు చేయండి

నింద్ర: రైతులు ఆయిల్ పామ్ తోటలు సాగు చేసి అధిక దిగుబడులు పొందాలని ఆయిల్ పామ్ మేనేజర్ రజని కోరారు. మంగళవారం నింద్రలో రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి రజని మాట్లాడారు. ఆయిల్ పామ్ తోటలు అన్ని రకాల నేలల్లో సాగు చేయవచ్చన్నారు. 3ఎఫ్ ఆయిల్ పామ్ కంపెనీ మండలంలో పలువురు రైతులకు సబ్సిడీపై ఈ మొక్కలు పంపిణీ చేస్తామన్నారు. ఈ పంట సాగుతోపాటు అంతర పంటలు కూడా వేసుకోవచ్చని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 3ఎఫ్ అధికారులు, మండలంలోని రైతులు పాల్గొన్నారు.

వరి పంటకు బీమాపై అవగాహన

పూతలపట్టు(యాదమరి): వరి సాగు చేసే ప్రతి రైతూ తప్పనిసరిగా బీమా చేసుకోవాలని ఏఓ మధురవాణి అన్నారు. మంగళవారం ఆమె మండల కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. డీఆర్‌సీ ఏడీఏ నాగపద్మిని, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సంధ్యారాణి ముఖ్య అతిథులుగా రైతులతో మాట్లాడారు. ప్రస్తుత వర్షాకాలంలో వరి పంటపై పెనుప్రభావం చూపే ప్రమాదం ఉందని చెప్పారు. ఈదురు గాలులకు, భారీ వర్షాలకు పంట దెబ్బతినే అవకాశం ఉందని చెప్పారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ శ్యామల

నింద్ర: బాలింతలు, కిశోర బాలికలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని సూపర్‌వైజర్ శ్యామల అన్నారు. మంగళవారం మండలంలోని పట్టెడ, శ్రీరామాపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఆమె మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకత, చిరుధాన్యాల్లో పోషక విలువలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కుష్ఠు, హెచ్ఐవీ నిర్మూలనే లక్ష్యం

–జిల్లా క్షయ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్



మాట్లాడుతున్న డాక్టర్ వెంకట ప్రసాద్

గంగాధర నెల్లూరు: కుష్ఠు, హెచ్ఐవీ, క్షయ తదితర వ్యాధుల నిర్మూలనే లక్ష్యంగా పని చేయాలని క్షయ వ్యాధి నిర్మూలన జిల్లా అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ ఆదేశించారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం వైద్యాధికారులు, సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. సికెల్ సెల్ అనీమియా స్క్రీనింగ్, క్షయ, హెచ్ఐవీ, కుష్ఠు లాంటి వ్యాధుల నిర్మూలనపై జీడి నెల్లూరు, తూగుండ్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వైద్య సిబ్బందితో సమీక్షించారు. కార్యక్రమంలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ గురు ప్రకాష్, సీహెచ్ఓ కృష్ణయ్య , సూపర్‌వైజర్ భగవతి, ఎంఎల్ఎల్ హెచ్‌పీ, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మండలాన్ని ప్రగతి పథంలో నడిపిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనిత

గంగాధర నెల్లూరు: మండలాన్ని ప్రగతి పథంలో నడిపించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులదని ఎంపీపీ అనిత అన్నారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అనిత అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని సర్పంచులు ఎంపీటీసీలు అధికారులతో కలిసికట్టుగా మండలం అభివృద్ధి చేయాలని సూచించారు. సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని అన్నారు. స్థానిక సర్పంచ్ వీసీ సుబ్రహ్మణ్యం యాదవ్ మండల కేంద్రంలో శ్మశాన వాటిక కావాలని అధికారులను కోరారు. వెజ్జుపల్లి సర్పంచ్ హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ శాఖ గ్రామాల్లో అత్యవసర సేవలు త్వరితగతన చేయాలని గత సమావేశంలో కూడా ప్రస్తావించినా చర్యలు చేపట్టకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. పాపిరెడ్డిపల్లి సర్పంచ్ పార్థసారథిరెడ్డి , ఎంపీటీసీ భారతీ తమ గ్రామంలో సర్పంచ్ తీర్మానం ఇచ్చినా అధికారులు డ్రైనేజీ నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ఎంపీడీఓ స్పందిస్తూ రెవెన్యూ అధికారులతో సమీక్షించి త్వరలోనే సత్వర చర్యలు తీసుకుంటామని అన్నారు. అలాగే ముసలయ్యగారిపల్లిలో నీటి సమస్య, పెద్ద కాలువ పంచాయతీలో రెవెన్యూ సమస్యలపై ఎంపీటీసీలు, సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. జెడ్పీటీసీ లక్ష్మీప్రియ, వైస్ ఎంపీపీలు హరిబాబు, బేబీ, ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి, ఎమ్మార్వో శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీల బెదిరింపులు ఇక సాగవు

చిత్తూరు రూరల్(కాణిపాకం): ఇన్నాళ్లు ఫ్యాక్టరీ వాళ్లు ఏం చెప్పినా విన్నాం..ఇకపై వారి బెదిరింపులు సాగవని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ తెలిపారు. చిత్తూరు నగరం జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం జాతీయ మామిడి దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం తోతాపురి కేజీకి రూ.12గా మద్దతు ధర ప్రకటించిందన్నారు. ఇన్నాళ్లు ఈ ఫ్యాక్టరీలు, ర్యాంపులు రూ.2.50, రూ.4, రూ.5, రూ.6 చొప్పున ఇస్తాయన్నారు. ఏదైతే రాష్ట్రప్రభుత్వం ఫ్యాక్టరీలు రూ.8 ఇవ్వాలని ప్రకటించిందో.. ఆ ధర ప్రకారమే ఫ్యాక్టరీలు చెల్లించేలా చూస్తామన్నారు. ఇన్నాళ్లు వారు ఏం చెప్పినా నోరు మెదపకుండా ఉన్నామన్నారు. ఫ్యాక్టరీలు కాయలు కొనుగోలు చేయాలనే ఉద్దేశంతో ఇన్నాళ్లు ఓపికగా ఉన్నామన్నారు. ఇక కాయల కొనుగోలు ముగిసిందని, గుజ్జు తయారీ పూర్తయిందన్నారు. ఇప్పుడు వాళ్ల గుజ్జు తమ అడ్డాలో ఉందని, ఇక వారి బెదిరింపులు సాగవన్నారు. కచ్చితంగా ఫ్యాక్టరీల నుంచి తోతాపురి కేజీకి రూ.8 చొప్పున వసూళ్లు చేయిస్తామన్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మామిడికి ప్రోత్సాహం అందిస్తున్నాయని తెలిపారు. రైతు నాయకులు పాల్గొన్నారు.

వరాహి శక్తి పీఠంలో ఆడి ఉత్సవాలు

–రేపు అగ్నిగుండ ప్రవేశం



ప్రత్యేక అలంకరణలో వరాహి అమ్మవారు

పుత్తూరు: మండలంలోని పరమేశ్వరమంగళం గ్రామ సమీపంలోని కనుమిట్ట వద్ద ఉన్న శ్రీదక్షిణ కాళి వరాహి శక్తి పీఠంలో నిర్వహిస్తున్న ఆడి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వరాహి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. బుధవారం సాయంత్రం కలశ ప్రతిష్ట, గురువారం ఉదయం 9.30 గంటలకు మహా ప్రత్యంగిర హోమం, మధ్యాహ్నం 12.30 గంటలకు అభిషేక ఆరాధన, మహా హారతి, అన్నదానం, సాయంత్రం 6 గంటలకు భక్తుల అగ్నిగుండ ప్రవేశం, రాత్రి కుంభ సమర్పణ, అదేరోజు ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు మోహనమ్మ, హరి, వెంకటేశ్వర్లు తెలిపారు.

రెడ్‌బుక్‌పైనే కూటమి దృష్టి



మాట్లాడుతున్న నేతలు

శ్రీరంగరాజపురం: వైఎస్సార్‌సీపీలో బలమైన నేతలే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి రెడ్‌బుక్ అమలు చేస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కాలప్ప అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రం వ్యాప్తంగా జరిగిన లిక్కర్ స్కాంలో బిగ్‌బాస్ చంద్రబాబేనని అన్నారు. 2014–2019 మధ్య టీడీపీ ప్రభుత్వంలో లిక్కర్ స్కాంలో అడ్డంగా దొరికిపోయాడన్నారు. నేడు రాజకీయ కక్షతో వైఎస్సార్‌సీపీ నేతలపై అకమ కేసు బనయించడం దారణమని మండిపడ్డారు. ప్రజాపాలన గాలికి వదిలి రెడ్‌బుక్‌పైనే కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టిందని అన్నారు. మిథున్‌రెడ్డిపై అక్రమ కేసు పెట్టడం దారుణం అన్నారు. రానున్న రోజుల్లో ప్రజాకోర్టులో చంద్రబాబు దోషిగా నిలబడడం ఖాయమన్నారు. నేతలు మణి, జనార్దన్, రమేష్, గిరి, వేంకటేష్, పేతురు, కోటి, శివలింగం, హరీష్, అల్లెయ్య పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై దృష్టి పెట్టండి



కాలువను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాలసముద్రం: ప్రస్తుత సీజన్‌లో పారిశుధ్యం లోపం లేకుండా గ్రీన్ అంబాసిడర్లు, పారిశుధ్య కార్మికులు పనిచేయాలని ఎంపీడీఓ సతీష్ ఆదేశించారు. మంగళవారం శ్రీబొమ్మరాజుపురం ఆదిఆంధ్రవాడ గ్రామంలో మురుగునీటి కాలువను పరిశీలించారు. కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం శుభ్రం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. చెత్త నుంచి సంపదపై గ్రీన్ అంబాసిడర్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు. మండల విస్తరణాధికారి సత్యనారాయణ, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

నింద్ర: పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని వైద్యాధికారి వినిషా అన్నారు. మంగళవారం నింద్రలో ఏఎన్ఎంలకు సమావేశం నిర్వహించి ఆమె మాట్లాడారు. వర్షాలు కురుస్తుండటం, వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలు జ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. నివాస ప్రాంతాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ గోపి, సీహెచ్ఓ శ్రీదేవి, సిబ్బంది సురేష్, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకత కోసమే సమాచార హక్కు





హాజరైన విద్యార్థులు, అధ్యాపకులు, మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చంద్రమౌళి

పుత్తూరు: ప్రభుత్వ పాలనలో పారదర్శతను పెంచడానికి, అవినీతిని నియంత్రించడానికి తీసుకొచ్చిన చట్టమే సమాచార హక్కు చట్టమని స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.చంద్రమౌళి అన్నారు. భారత ప్రభుత్వం సమాచార హక్కు చట్టం తీసుకొచ్చి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో పాశుపతాస్త్రం వంటిదన్నారు. ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకుంటే ప్రజలు పలు ప్రయోజనాలు పొందేందుకు అవకాశం ఉందన్నారు. అయితే కొందరు ఈ చట్టాన్ని దుర్వినియోగం చేయడం దురదృష్టకరమన్నారు. కాలేజీలో నాలుగు రోజుల పాటు విద్యార్థులకు సమాచార హక్కు చట్టంపై వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కోటేశ్వరయ్య, అధ్యాపకులు నరసింహులు, నాగేశ్వరరావు, వాణిశ్రీ, సావిత్రి, సూర్యబాబు, షరిమ్మల, గాయత్రి, శ్రీదేవి, పద్మావతి, వరలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో ప్రదోష పూజలు



ప్రదోష పూజల్లో భక్తులు

కార్వేటినగరం: మండల కేంద్రం సమీపాన సుద్ధగుంటలోని శిష్టా సౌందర్యవల్లి సమేత సదాశివేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రదోష పూజలు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజల అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం వేద పండితులు ప్రదోష పూజలు నిర్వహించారు.

పౌల్ట్రీ రంగంపై విద్యార్థులకు అవగాహన



పౌల్ట్రీ నమూనాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యులు

నగరి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ విభాగం పౌల్ట్రీ ఫార్మ్‌పై మంగళవారం అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వేణుగోపాల్ , పౌల్ట్రీ ప్రాముఖ్యత, ప్రపంచవ్యాప్తంగా దీనికి పెరుగుతున్న డిమాండ్, ఆహార భద్రత, ఉపాధి అవకాశాలను వివరించారు.ప్రముఖ పారిశ్రామికవేత్త, జువాలజీ విభాగ బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యులు కేఎస్. మనోజ్ పౌల్ట్రీ రంగంలోని వ్యాపార అవకాశాలు, భవిష్యత్ సాధ్యతల గురించి వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.భాస్కర్ రాజు మాట్లాడుతూ, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పౌల్ట్రీ రంగం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందని, జీవనోపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు. పౌల్ట్రీ రంగంలోని పోషక, ఆర్థిక ప్రయోజనాల గురించి వివరించారు. ప్రస్తుత సమయంలో ప్రొటీన్ అవసరాలు, పోషకాహార లోపాల సమస్యలకు పౌల్ట్రీ సాధ్యమయ్యే పరిష్కారాలను చర్చించారు. విద్యార్థులు పౌల్ట్రీ నమూనా పోటీలో ప్రదర్శించిన నమూనాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఐక్యూ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఇంద్ర ప్రియదర్శిని, జువాలజీ విభాగాధ్యక్షురాలు, కార్యక్రమ కో–ఆర్డినేటర్ డాక్టర్ జి. స్వాతి, అధ్యాపకులు రేవతి, అరుణ కుమారి, సుహాసిని, శ్రీలక్ష్మి, తిరుమల వసుదేవరావు, రామానుజులు తదితరులు పాల్గొన్నారు.